సింగరేణి జాయింట్ వెంచర్‌ను ఒప్పుకోం

తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : రామగుండం థర్మల్ ప్లాంట్‌ను సింగరేణి భాగస్వామ్యంతో నిర్మించేందుకు ఎట్టి పరిస్థితిలో ఒప్పుకునేది లేదని, ఈ ప్లాంట్‌ను జెన్‌కో ద్వారానే నిర్మించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం చేసింది. జాయింట్ వెంచర్ అంటే ప్రైవేటీకరణను ప్రోత్సహించడమేనని జేఏసీ నేతలు ఆరోపించారు. జేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం ఖైరతాబాద్‌లోని విద్యుత్తు సౌధలో జేఏసీ నేతలు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ.. మూడేండ్లుగా జెన్‌కో లాభాల్లో నడుస్తున్నదని, 2020-21లో రూ. 168 కోట్లు, 2021-22లో రూ.394.46 కోట్లు, 2022-23లో రూ.472.94 కోట్ల లాభాలను ఆర్జించిందని తెలిపారు. జెన్‌కో ఈక్విటీతోనే రామగుండంలో నిర్మించతలపెట్టిన 800 మెగావాట్ల ప్లాంట్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు, కో కన్వీనర్ బీసీ రెడ్డి, వజీర్, మాజీద్, రమేశ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉత్పత్తి లక్ష్యం పెంపు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : బొగ్గు ఉత్పత్తి, రవాణాలో సింగరేణి లక్ష్యాన్ని క్రమంగా పెంచుకుంటున్నది. ఇది వరకు రోజుకు రెండు లక్షల బొగ్గును ఉత్పత్తి, రవాణా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ.. తాజాగా దీనిని 2.1 లక్షల టన్నులకు పెంచుకున్నది. బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని కంపెనీ సీఎండీ ఎన్ బలరాం ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో పాటు రోజుకు 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని అన్ని ప్రాంతాల జీఎంలకు ఆయన ఆదేశాలిచ్చారు. భారీ వర్షాలతో కొద్ది రోజుల పాటు సింగరేణిలో ఉత్పత్తి నిలిచిపోగా, వార్షిక లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగంగా ఈ లక్ష్యాన్ని నిర్ధేశించారు.

● నల్లబ్యాడ్జీలతో కేటీపీపీ ఉద్యోగుల నిరసన



థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాలను జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని, సింగరేణి భాగస్వామ్యాన్ని అంగీకరించబోమని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులోని కేటీపీపీలో శనివారం ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. - గణపురం

చేనేత రుణమాఫీ ఏమాయే..!

- **ఇచ్చిన హామీని బుట్టదాఖలు చేస్తున్న కాంగ్రెస్ సర్కారు**
- **తీవ్ర ఆవేదనలో చేనేత కార్మికులు**

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలు మాఫీ చేస్తామని మాట ఇచ్చిన ప్రభుత్వం.. ఇంతవరకు పట్టించుకోకపోవడమే ఇందుకు కారణమవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 10 వేల మంది కార్మికులు ఈ మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 'చేనేత పాలసీ' అనేది ఏదీ లేదని చేనేత కార్మికులు మండిపడుతున్నారు. చేనేతలను సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని చేనేత కార్మికసంఘం రాష్ట్ర నాయకులు కూరపాటి రమేశ్, చెరుకు స్వామి విమర్శిస్తున్నారు. మరికొన్ని డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు.

- చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించాలి.
- చేనేతల కోసం రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలనే డిమాండ్‌ను నెరవేర్చాలి
- త్రిఫ్ట్ ఫండ్, యూరన్ సబ్సిడీ, నేతన్నకు బీమా పథకాలు అమలు చేయాలి
- బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- వస్త్రనిల్వలు వెంటనే కొనుగోలు చేయాలి
- వర్కర్ టూ ఓనర్, జనతా వస్త్ర పథకాలను అమలు చేయాలి
- పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి
- యూరన్ సబ్సిడీ నిధులను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలి
- ప్రతి నేతన్నకు పెట్టుబడిసాయం కింద రూ.5 లక్షలు అందించాలి
- ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన వస్త్రాలను రాష్ట్రంలో ఉత్పత్తి చేయించాలి.

టీ కొట్టు శివకు ఐదు కొలువులు

- **పోటీ పరీక్షల్లో పెద్దపల్లి జిల్లా ధర్మారం యువకుడి సత్తా**
- **గత మార్చిలో గురుకుల జేఎల్, పీజీటీ, టీజీటీల్లో ప్రతిభ**
- **తాజాగా జేఎల్, డీఎస్సీలో విజయ ఢంకా**

మహేశ్ కుమార్

ధర్మారం, అక్టోబర్ 5: ఓ పేదింటి బిడ్డ.. ప్రభుత్వ కొలువులు కొల్లగొట్టాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులతో కొన్నాళ్లు టీకొట్టు నడిపిన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన ఉడాన్ శివ మహేశ్ కుమార్.. ఆరు నెలల్లోనే ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తాచాటాడు. ధర్మారానికి చెందిన ఉడాన్ సుశీల-లక్ష్మణ్ దంపతులకు శివ మహేశ్ రెండో కొడుకు. ధర్మారంలో చదువుకుంటూనే తల్లిదండ్రులకు సాయపడేవాడు. 2014లో సునీతను వివాహం చేసుకున్నాడు. 2020లో పీజీ పూర్తిచేశాడు. కరోనా టైంలో రాజారాంపల్లిలో టీకొట్టు నడిపాడు. తర్వాత దానిని వదిలేసి తల్లిదండ్రులు, మిత్రుల సహకారంతో 2022లో జూనియర్ లెక్చరర్ ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకున్నాడు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో గురుకులాల లెక్చరర్, టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా.. అదే ఏడాది ఆగస్టులో పరీక్షలు రాశాడు. గత మార్చిలో ఫలితాలు రాగా.. జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ కొలువులకు ఎంపికయ్యాడు. జూనియర్ లెక్చరర్ పోస్టును ఎంపిక చేసుకొని ప్రస్తుతం నిర్మల్ జిల్లా మామడలోని గురుకులంలో పనిచేస్తున్నాడు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 సెప్టెంబర్‌లో నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఉద్యోగాల భర్తీ పరీక్ష, ప్రస్తుత ప్రభుత్వం ఆగస్టు 2024లో నిర్వహించిన డీఎస్సీ పరీక్షలు రాసి ప్రతిభ చాటాడు. ఇటీవలే విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంక్, డీఎస్సీ ఫలితాల్లో పెద్దపల్లి జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ఈ విజయం తన తల్లి దండ్రులకే అంకితమని శివమహేశ్ తెలిపారు.

నిలిచిన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల వెరిఫికేషన్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): పలు జిల్లాల్లో డీఎస్సీలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిలిచిపోయింది. కొన్ని జిల్లాల్లో ఇంకా 1:3 జాబితాలు విడుదల కాలేదు. కోర్టుకేసుల కారణంగా నిలిచినట్టు అధికారులు ప్రకటించారు. శనివారం వరకు (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్, భాషాపండితులు, పీఈటీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాగా, స్పెషల్ ఎడ్యుకేషన్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కోర్టుకేసులు లేని జిల్లాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తిచేశామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి తెలిపారు.

- నల్లగొండలో ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కానీ ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ జాబితాలో 31కి 29 మంది హాజరయ్యారు.

హరీశ్ (ఫైల్)

సురేశ్ (ఫైల్)

హేమలత (ఫైల్)

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు కుటుంబం బలి

- **రూ.30 లక్షలకుపైగా కుమారుడి అప్పులు**
- **20 గుంటల భూమి అమ్మి అప్పుల చెల్లింపు**
- **మనస్తాపంతో కుమారుడితోపాటు తల్లిదండ్రుల ఆత్మహత్య**
- **నిజామాబాద్ జిల్లా వడ్డేపల్లిలో విషాదం**

ఎడపల్లి, అక్టోబర్ 5: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో కుటుంబం బలైంది. రూ.లక్షలు పోగొట్టిన ఓ యువకుడితోపాటు అతడి తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన శనివారం నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన రంగణవేణి సురేశ్ (55), హేమలత (48) దంపతులకు ఇద్దరు సంతానం. మెదడువాపు వ్యాధితో కూతురు చిన్నప్పుడే మృతి చెందింది. ఏకైక కుమారుడు హరీశ్ (22) నిజామాబాద్‌లో ఉంటూ పెట్రోల్ బంక్‌లో పని చేసేవాడు. ఆర్నెళ్ల క్రితం పని మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. సురేశ్ దంపతులు చిన్న కిరాణషాపు నడుపుతూ వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. కొత్త ఇల్లు కట్టుకుందామన్న ఆశతో గృహ నిర్మాణాన్ని ప్రారంభించారు. కుమారుడు హరీశ్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి భారీగా అప్పులు చేశాడు. దీంతో తల్లిదండ్రులు ఇంటి నిర్మాణాన్ని ఆపేశారు. హరీశ్ చేసిన రూ.30 లక్షలకుపైగా అప్పులను తమకున్న 20 గుంటల భూమిని అమ్మేసి తీర్చారు. అయినప్పటికీ కుమారుడిలో మార్పు రాలేదు. నలుగురిలో తిరగలేక మనస్తాపం చెందిన తల్లిదండ్రులు, కుమారుడు శుక్రవారం రాత్రి ఉరేసుకున్నారు. తెల్లారినా ఎలాంటి అలికిడి లేకపోవడంతో ఇరుగుపొరుగు ఇంటి వెనుక నుంచి చూడగా వేలాడుతూ కనిపించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉగాండాలో జనగామవాసి హత్య

సెక్యూరిటీ గార్డు జరిపిన కాల్పుల్లో ప్రాణాలొదిలిన తిరుమలేశ్

తిరుమలేశ్ (ఫైల్)

జనగామ చౌరస్తా, అక్టోబర్ 5 : ఉగాండా దేశంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న జనగామ వాసి ఇటికాల తిరుమలేశ్ (41) శుక్రవారం అక్కడ హత్యకు గురయ్యాడు. మృతుడి తమ్ముడు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రంలోని గిర్నిగడ్డ ఏరియాకు చెందిన తాపీ మేస్త్రీ ఇటికాల కిష్టయ్య-కిష్టమ్మ దంపతుల పెద్ద కుమారుడు తిరుమలేశ్ నల్లగొండ జిల్లాకు చెందిన రాయల్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 2014 నుంచి ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ కంపెనీకి ఉగాండాలోని నమ్మసాలలో బ్రాంచ్ కార్యాలయం ఉండటంతో 15 నెలల నుంచి భార్య, కుమారుడితో కలిసి తిరుమలేశ్ అక్కడే ఉంటున్నాడు. గురువారం ఉదయం 9.30 గంటలకు (ఉగాండా కాలమానం ప్రకారం) డ్యూటీకి వెళ్లాడు. అక్కడ కొత్తగా విధుల్లో చేరిన సెక్యూరిటీ గార్డు ఓపియో మద్యం మత్తులో గాల్లోకి కాల్పులు జరుపుతుండగా సహోద్యోగులతో కలిసి తిరుమలేశ్ బయటకు వచ్చాడు. సెక్యూరిటీగార్డు విచక్షణ కోల్పోయి తిరుమలేశ్‌పైకి కాల్పులు జరపగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తిరుమలేశ్ భార్య సునీత, కుమారుడు వరుణ్ ఉగాండాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. కాగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో వారిని పరామర్శించారు.

సీపీ అంబర్‌కిషోర్‌ఝాకు ఆహ్వాన పత్రం అందిస్తున్న దసరా ఉత్సవ సమితి

సీపీని కలిసిన కాశీబుగ్గ దసరా ఉత్సవ సమితి బాధ్యులు

కాశీబుగ్గ, అక్టోబర్ 5: గ్రేటర్ వరంగల్‌లోని కాశీబుగ్గ పద్మనగర్‌లో నిర్వహించే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝాను కాశీబుగ్గ దసర ఉత్సవ సమితి మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. సమితి అధ్యక్షుడు దూపం సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ఉత్సవాల ఏర్పాట్లను వివరించారు. మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీలు బస్వరాజ్ సారయ్య, డాక్టర్ బండా ప్రకాశ్, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి లక్షలాదిగా ప్రజలు పాల్గొంటారని తెలిపారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. బయ్య స్వామి, సముద్రాల పరమేశ్వర్, గుల్లపల్లి రాజుకుమార్, పిలువేరు శ్రీనివాస్, గోరంటల మనోహర్, సిద్దోజు శ్రీనివాస్, వేముల నాగరాజు, సిలివేరు థామస్, ఓంప్రకాశ్ కోలారియా, రామా యాదగిరి, క్యాతం రంజిత్, కేతిరి రాజశేఖర్, సిందం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా రేపు ధర్నా

ఖిలావరంగల్, అక్టోబర్ 5: పాలస్తీనాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులకు నిరసనగా సోమవారం వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో ధర్నా నిర్వహించనున్నారు. ఈమేరకు విజయవంతం చేయాలని పదకొండు వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. శనివారం శివనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు వెల్లడించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ నాగయ్య, ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలో గుర్తుతెలియని మృతదేహం

వర్ధన్నపేట, అక్టోబర్ 5 : మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లకుంటతండా సమీపంలో ఎస్సారెస్పీ ప్రధాన కాలువలో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. కెనాల్‌లో శవం ఉన్నట్లు స్థానిక గిరిజనులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం చేసేందుకు తరలించినట్లు ఎస్సై రాజు తెలిపారు.

ఆకేరువాగు చెక్‌డ్యామ్‌కు తాత్కాలిక మరమ్మతులు

చెక్‌డ్యాంకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

వర్ధన్నపేట, అక్టోబర్ 5: ఆకేరువాగు చెక్‌డ్యామ్‌కు తాత్కాలిక మరమ్మతులు చేశారు. గత ఏడాది వచ్చిన భారీ వరదకు పట్టణ సమీపంలోని ఆకేరువాగు చెక్‌డ్యామ్ కోతకు గురైంది. దీంతో నీరంతా వృథాగా పోతుండగా స్థానికులు పలుమార్లు అధికారులు, ఎమ్మెల్యే నాగరాజుకు విన్నవించారు. కానీ అధికారులు ప్రస్తుతం నీరు నిలిచేలా తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వాగులోని మట్టితో రింగ్‌బండ్ ఏర్పాటు చేయడంతోపాటు కోతకు గురికాకుండా ఇసుక బస్తాలను పేర్చారు. దీంతో వాగులో ప్రస్తుతం వస్తున్న కొద్దిపాటి నీటితో చెక్‌డ్యామ్‌లో నీరు నిలుస్తున్నది. కాగా, ఆకేరువాగు నుంచి తరలిస్తున్న ట్రాక్టర్లను అధికార పార్టీ నాయకుడు ఆపి ఇసుక బస్తాలు వేయించడంపై విమర్శలు వస్తున్నాయి. వాగులో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాల్సి ఉండగా, అదే ఇసుకను చెక్‌డ్యామ్ మరమ్మతులకు ఉపయోగిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ ఇసుకతో పనులు చేయించి బిల్లులు ఎలా చెల్లిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రావణవధకు వేదిక రంగలీలా మైదానం

■ **వందల ఏళ్లుగా నిర్వహణ** ■ **12న వేడుకలు**

కరీమాబాద్, అక్టోబర్ 5: ఉర్సు రంగలీలా మైదానంలో రావణవధ కార్యక్రమానికి ఎంతో ప్రత్యేకత ఉంది. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ప్రభుత్వ సహకారంతో పలు శాఖల అధికారులు, కమిటీ సభ్యులు దసరా వేడుకలకు ఉర్సు రంగలీలా మైదానం వేదిక గా మారింది. ఇక్కడ వందల ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ వేడుకలు మైసూర్‌కు దీటుగా కొనసాగుతున్నాయి. ఇక్కడ రంగు రంగుల తారాజువ్వల వెలుగులు, భారీగా శబ్దం చేసే పటాకులు, దారుల్లో విద్యుత్ దీపాల వెలుగులు, కిక్కిరిసే జనాలు, ఆటా-పాట, యువత కేరింతలతో సందడిగా ఉంటుంది. ఏర్పాట్లకు వందలాదిమంది శ్రమిస్తారు. ఈ నెల 12న వేడుకలు జరగనున్నాయి. ప్రస్తుతం 70 నుంచి 75 అడుగుల భారీ రావణ ప్రతిమను సిద్ధం చేస్తున్నారు.

ఉర్సు రంగలీలా మైదానంలోని రావణ ప్రతిమ (ఫైల్)

నెల రోజులుగా శ్రమిస్తున్నాం

కమిటీ సభ్యులందరం సమష్టిగా దసరా వేడుకల విజయవంతానికి నెల రోజులుగా శ్రమిస్తున్నాం. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను కలిసి కోరాం. మైదానంలో అవసరమైన పనులను అధికారులకు విన్నవించాం. ప్రభుత్వం, దాతల సహకారం మరువలేనిది.

– *నాగపూరి సంజయ్‌బాబు, దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు*

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

మాట్లాడుతున్న కౌన్సిలర్ దార్ల రమాదేవి

నర్సంపేట, అక్టోబర్ 5: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని కౌన్సిలర్ దార్ల రమాదేవి అన్నారు. శనివారం నర్సంపేటలో మాట్లాడుతూ ఎమ్మెల్సీ కోదండరాం సన్మానసభ ఈనెల 6న నర్సంపేటలో జరుగుతుందని దీనికి ఉద్యమకారులందరూ హాజరుకావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో పెట్టినట్లుగా ఉద్యమకారులకు 250 గజాల స్థలం, డబుల్‌బెడ్‌రూం ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, నెలకు రూ.25 వేల పెన్షన్ అందించాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. పుట్టపాక కుమారస్వామి, మచ్చిక నర్సయ్యగౌడ్, బైరి తిరుపతిరెడ్డి, రామసహాయం ఉపేందర్‌రెడ్డి, బోళ్ల స్వామి, వల్లెపు శ్రీనివాస్, మంచోజు కల్యాణరాముడు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రేపటి ప్రజావాణి రద్దు

ఖిలావరంగల్, అక్టోబర్ 5: వరంగల్ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలన పరమైన కారణాల వల్ల రద్దు చేస్తున్నామని, ప్రజలు ఫిర్యాదులు ఇచ్చేందుకు రావద్దని కోరారు.

నెక్కొండ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

రికార్డుల తనిఖీలో నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్

నెక్కొండ, అక్టోబర్ 5: నెక్కొండ పోలీస్‌స్టేషన్‌ను నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా పోలీసు సిబ్బంది పనితీరు, క్రమశిక్షణ, పోలీసుల ఆరోగ్యం తదితర విషయాలను తెలుసుకున్నారు. ఏసీపీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించి, సరైన న్యాయం చేయాలన్నారు. రౌడీలు, అనుమానితులపై నిఘా పెంచాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసుల విచారణ సత్వరమే పూర్తిచేయాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి సీఐ చంద్రమోహన్, ఎస్సై మహేందర్‌కు సూచనలు చేశారు.

'బిట్స్'లో బతుకమ్మ, దసరా వేడుకలు

బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు

నర్సంపేట రూరల్, అక్టోబర్ 5: మండలంలోని లక్నెపల్లి శివారు బాలాజీ విద్యాసంస్థల్లో శనివారం బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ అండ్ర రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ట్రెజరర్ అండ్ర వనజారెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు బతుకమ్మలను పేర్చి తీసుకొచ్చి కళాశాల ఆవరణలో ఒక చోట పెట్టి పాడుతూ ఆడారు. దసరా పండుగలో ప్రత్యేకమైన శమీ (జమ్మి) పూజ, రావణాసుర వధ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ హరిహరన్, సెక్రటరీ డాక్టర్ జి.రాజేశ్వర్‌రెడ్డి, ఏవో సలేంద్రసురేష్, నారాయణ, ఫణిందర్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

గీసుగొండ, అక్టోబర్ 5: మండలంలోని కొమ్మాలకు చెందిన మామునూరి శ్రీనివాస్ అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి శనివారం మనుగొండకు చెందిన సామాజిక వ్యాపారవేత్త అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారి లో నాయకులు అల్లం మర్రెరెడ్డి, వీరగోని రాజుకుమార్, గోనె మల్లారెడ్డి, వీ తిరుపతి, కొమురయ్య, స్వామి రాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తి వివరాలను నమోదు చేయాలి

మధిర మందపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

దుగ్గొండి, అక్టోబర్ 5: ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో ప్రతి వ్యక్తి వివరాలను డిజిటల్ కార్డులో నమోదు చేయాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. శనివారం మండలంలోని మధిర మందపల్లిలో డిజిటల్ కార్డు సర్వేను ఎంపీడీవో అరుంధతి, తహసీల్దార్ రవిచంద్రరెడ్డితో కలిసి పరిశీలించారు. సర్వేపై సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామంలో కుటుంబసభ్యుల వివరాల నమోదుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీవో మోడెం శ్రీధర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ కవిరాజ్

గీసుగొండ, అక్టోబర్ 5: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ప్రాజక్టు మేనేజర్ కూసం కవిరాజ్ అన్నారు. మండలంలోని అనంతారంలో శనివారం మహిళా సంఘాల సభ్యులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా చదివించాలని, అప్పుడే సమాజంలో ఆడ, మగ తేడా ఉండదన్నారు. కోఆర్డినేటర్ అక్తర్, శ్రీనివాస్, రజిత, పద్మావతి, రాణి, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మృతుడి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

బాధిత కుటుంబానికి 'పెద్ది' పరామర్శ

నల్లబెల్లి, అక్టోబర్ 5: బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి శనివారం పరామర్శించారు. మండలంలోని నారక్కపేటకు చెందిన బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి పెరుగు కృష్ణమూర్తి తల్లి పెరుగు కొమురమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందింది. పెద్ది మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, ప్యాక్స్ చైర్మన్ చెట్టుపెల్లి మురళీధర్‌రావు, కారుకూరి శ్రీనివాస్, ఏ సాంబరావు, రవి, కన్నూరి రమేశ్, తిరుపతి పాల్గొన్నారు.

చేపల్లో వ్యాధి నిర్ధారణపై ముగిసిన శిక్షణ

మాట్లాడుతున్న జిల్లా మత్స్య అధికారి నాగమణి

కరీమాబాద్, అక్టోబర్ 5: పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి, హైదరాబాద్ సౌజన్యంతో చేపల్లో వ్యాధి నిర్ధారణ, ఆరోగ్య నిర్వహణపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణి మాట్లాడుతూ చేపల్లో వ్యాధి నిర్ధారణ, ఆరోగ్య నిర్వహణపై శిక్షణ పూర్తి చేసుకున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పొందిన రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సభను విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న అంబటి శ్రీనివాస్

నర్సంపేట, అక్టోబర్ 5: నర్సంపేటలో ఆదివారం నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల సభను విజయవంతం చేయాలని ప్రముఖ న్యాయవాది, తెలంగాణ జనసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో నర్సంపేట నియోజకవర్గంలోని కుల సంఘాలు, ప్రజా సంఘాలు, అన్ని వర్గాల ప్రజలు ఏకమై 736 రోజులు నర్సంపేట అంబేద్కర్ సెంటర్‌లో దీక్షలు చేపట్టినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సదస్సులో ఉద్యమకారులందరూ పాల్గొని కోరారు. నాయకులు ఎర్ర జగన్మోహన్‌రెడ్డి, మల్లేశం, జావిద్, జగన్, గుడిపూడి అరుణ పాల్గొన్నారు.

కీటకజనిత వ్యాధులను నియంత్రించాలి

గిర్మాజీపేట, అక్టోబర్ 5: కీటకజనిత వ్యాధులను నియంత్రించాలని వైద్య, ఆరోగ్యశాఖ అదనపు సంచాలకుడు అమర్‌సింగ్‌నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం డీఎంహెచ్‌వో వెంకటరమణ ఆధ్వర్యంలో మలేరియా, ఫైలేరియా నియంత్రణ కార్యక్రమాలపై ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో డెంగ్యూ కేసులు నమోదవుతున్నందున వైద్యాధికారులు నివారణ చర్యలను వేగవంతం చేయాలన్నారు. నీరు నిల్వ ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని, సాయంత్రం వేళ ఫాగింగ్ చేయాలన్నారు. మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, జ్వరసర్వే నిర్వహించాలనారు. అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య, ఎంటమాలజీ ప్రోగ్రాం అధికారులు పద్మశ్రీ, మదన్‌మోహన్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు గోపాల్‌రావు, ప్రకాశ్, డీడీ అనిల్‌కుమార్, శ్రీనివాస్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న అమర్‌సింగ్‌నాయక్